17న సీతారాముల కల్యాణోత్సవం

కాచిగూడ: శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవ వేడుకలను తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ, మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన కాచిగూడలోని మున్నూరు కాపు భవన్, మ్యాడం అంజయ్య హాల్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం కాచిగూడలోని ట్రస్ట్ బోర్డు కార్యాలయంలో మున్నూరుకాపు మహాసభ ప్రతినిధులు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ మ్యాడం వెంకట్‌రావుతో సమావేశమై ఏటా నిర్వహిస్తున్న మాదిరిగానే ఈ ఏడాది శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలను సంయుక్తంగా నిర్వహిస్తుండటం పట్ల మున్నూరుకాపులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్ రావు, మంగళారపు లక్ష్మణ్, లింగిశెట్టి హనుమంతరావు, మణికొండ రమేష్, కట్టెల సుభాష్, ఆనంద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వానికి ఓబీసీ మహిళల మద్దతు

కాచిగూడ: కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి లోక్‌సభ ఎన్నికల్లో ఓబీసీ మహిళల మద్దతు ఉంటుందని ఓబీసీ సెంట్రల్ కమిటీ జాతీయ చైర్‌పర్సన్, ఓబీసీ మహిళా సమాఖ్య జాతీయ అధ్యక్షురాలు ఎం.భాగ్యలక్ష్మి ప్రకటించారు. భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో బీజేపీ ఓబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం బీజేపీకి బీసీ మహిళల మద్దతును ప్రకటిస్తూ లేఖ అందజేశారు. నరేంద్రమోదీ ప్రభుత్వంలోనే మహిళలకు న్యాయం జరుగుతుందని అన్నారు. మహిళా బిల్లును పెట్టిన ఘనత నరేంద్ర మోదీకే దక్కుతుందని అన్నారు. మహిళా బిల్లులో ఓబీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని ఆమె కోరారు. నాయకురాళ్లు సువర్ణ, యమున రాణి, మంగళగిరి శ్వేత, బైగొండ లలితా, లస్కర్ లక్ష్మీబాయి, శ్రీనిధి పాల్వాయి తదితరులు పాల్గొన్నారు.

లోప్రెషర్ నీటి సమస్య పరిష్కారానికి కృషి



ఆజాద్‌నగర్‌లో నీటి సమస్యను పరిశీలిస్తున్న విజయకుమార్‌గౌడ్

అంబర్‌పేట్: ప్రజలకు లోప్రెషర్ నీటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ తెలిపారు. సోమవారం అంబర్‌పేట డివిజన్ ఆజాద్‌నగర్‌లో లోప్రెషర్ నీటి సమస్యపై పర్యటించారు. లోప్రెషర్ తాగునీటి సమస్య లేకుండా జలమండలి అధికారులు పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిపాదనలు సిద్ధం చేస్తే నిధులు మంజూరు చేయాడానికి కృషి చేస్తానన్నారు. జలమండలి అధికారులు స్థానిక బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

'దహన' సంస్కారాలకు ఎమ్మెల్యే చేయూత



శ్మశానవాటిక కమిటీకి చేయూతనిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట్: పేదలు తమ బంధువులు, ఆత్మీయులు మరణిస్తే వారి దహన సంస్కరాలకు పడుతున్న ఇబ్బందులను గుర్తించి తనవంతు చేయూతనిస్తున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. నియోజకవర్గ పరిధిలో చనిపోయిన పేదల శవ దహన సంస్కరాలకు కావాల్సిన నగదును సోమవారం అంబర్‌పేట శ్మశాన వాటిక కమిటీకి ఎమ్మెల్యే అందించారు. ఐదు సంవత్సరాలుగా పేదల దహన సంస్కరాల కోసం వ్యక్తిగతంగా శ్మశాన వాటిక కమిటీకి నగదు అందిస్తున్నట్లు కాలేరు పేర్కొన్నారు. దహన సంస్కరాలకు నోచుకొని పేద కుటుంబాలకు తనవంతు అండగా ఉంటానన్నారు. శ్మశానవాటిక కమిటీ ప్రతినిధి కుమార్, బీఆర్ఎస్ నాయకులు అనిల్, శ్రీహరి పాల్గొన్నారు.

మాల, మాదిగలకు ప్రత్యేక కార్పొరేషన్‌లు ఏర్పాటు చేయాలి

కవాడిగూడ: మాదిగ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్, మాదిగలకు ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్, మాలల కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలకమండలి నియామకంతో పాటు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎస్సీ 57 ఉపకులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం కోరారు. ఆయన ఆధ్వర్యంలో దళిత సామాజిక వర్గానికి చెందిన ప్రజలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఎస్సీ ఉపకులాలకు ఆర్‌డీఓ ద్వారా కాకుండా ఎంఆర్‌ఓ ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో ఆలిండియా బేడబుడగ జంగాల ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ చింతల యాదగిరి, ఎస్సీ ఉపకులాల గౌరవ అధ్యక్షుడు డాక్టర్‌చంద్రగిరి రాజమౌళి, ప్రధాన కార్యదర్శి బాణాల మంగేష్, ఉపాధ్యక్షులు ఏర్పుల యాదయ్య, అధికార ప్రతినిధి రాజ దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపిస్తాం



మాట్లాడుతున్న కొల్లి నాగేశ్వర్‌రావు

కాచిగూడ: లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపిస్తామని ఆ పార్టీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్ రావు అన్నారు. సోమవారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రూ. 10 కోట్లు ఖర్చు పెట్టి దివ్యాంగులకు కావలసిన పరికరాలు అందించిన మొట్టమొదటి ఎంపీ కిషన్‌రెడ్డి అని అన్నారు. దివ్యాంగులకు అండగా నిలిచిన వ్యక్తి కిషన్‌రెడ్డి అని ఆయన పేర్కొన్నారు. దివ్యాంగులు కిషన్‌రెడ్డికి అండగా నిలిచి లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. దివ్యాంగుల సంఘం నాయకులు మహంకాళీ రవీందర్, శంకర్, గోవింద్, రాజు, పర్వతాలు, అశోక్ పాల్గొన్నారు.

జాగ్రత్తలతో వడదెబ్బకు చెక్!

- వృద్ధులు, పిల్లలు, బాలింతలు అప్రమత్తంగా ఉండాలి
- బాధితులకు తక్షణమే ప్రథమ చికిత్స అందించాలి
- ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించాలి
- ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్



ప్రొఫెసర్ డాక్టర్ కె.శంకర్, నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్

సాక్షి ఇంటర్వ్యూ

నల్లకుంట: వేసవి ప్రారంభంలోనే భానుడు విశ్వరూపం ప్రదర్శిస్తున్నాడు. రోజురోజుకూ ఎండలు ముదిరిపోతున్నాయి. ఎండ తీవ్రత కారణంగా ఉదయం 8 గంటలకే పిల్లలు, పెద్దలు బయట తిరగాలంటే జంకుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చని నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్ తెలిపారు. వేసవిలో ఎండల తీవ్రత నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై డాక్టర్ శంకర్‌తో 'సాక్షి' ఇంటర్వ్యూ.

ప్రశ్న: వడదెబ్బ తగలడానికి కారణాలు ఏమిటి?

జవాబు: ఎండ తీవ్రత కారణంగా శరీరంలోని తేమ శాతం తగ్గి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. దీని ప్రభావం మెదడుపై పడుతుంది. మెదడులో వేడిని నియంత్రించే సాధనం వేడికి గురవుతుంది. దీన్నే వడదెబ్బ అంటారు.

ప్రశ్న: నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: రోజుకు 5 నుంచి 6 లీటర్ల నీళ్లు తాగాలి. బయటకు వెళ్లే సమయంలో నీళ్ల బాటిల్ తీసుకెళ్లడం మంచిది. తలపై టోపీ ధరించాలి.

ప్రశ్న: లక్షణాలు ఎలా ఉంటాయి?

జవాబు: వడదెబ్బ తగిలిన వెంటనే నాలుక తడి ఆరిపోతుంది. శరీరంలోని ఉష్ణోగ్రతల్లో తేడాలు ఏర్పడతాయి. విరేచనాలు, వాంతులు ప్రారంభమవుతాయి. ఈ లక్షణాలు వచ్చిన వెంటనే అది వడదెబ్బ అని గుర్తించాలి. వడదెబ్బకు గురైన వ్యక్తికి వెంటనే ప్రథమ చికిత్స అందించి, ఆస్పత్రికి తరలించాలి.

ప్రశ్న: వడదెబ్బ సోకిన వ్యక్తిలో మార్పులు ఎలా ఉంటాయి?

జవాబు: వాతావరణంలో వేడి కారణంగా శరీరంలో ఉన్న లవణాలు, సోడియం, క్లోరైడ్ శాతం తగ్గిపోతాయి. డీహైడ్రేషన్‌కు గురవుతారు. ఎక్కువ ఉష్ణోగ్రత ఉన్న ప్రదేశాల్లో చాలా సమయం పనులు చేస్తే ఇలా జరుగుతుంది.

ప్రశ్న: వడదెబ్బ తగిలిన వ్యక్తికి ఎలాంటి చికిత్సలు అందించాలి?

జవాబు: వడదెబ్బ సోకిన వ్యక్తిని వెంటనే చల్లని ప్రదేశంలోకి తరలించాలి. తడి బట్టతో ఒళ్లంతా తుడవాలి. మంచి నీళ్లు తాగించాలి. ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలి. అప్పుడు కొంత వరకు ఉపశమనం కలుగుతుంది.

ప్రశ్న: ఫీవర్ ఆస్పత్రిలో వడదెబ్బ చికిత్సకు అవసరమైన మందులు ఉన్నాయా?

జవాబు: ఫీవర్ ఆస్పత్రిలో వడదెబ్బ చికిత్సకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి. ఐవీ ఫ్లూయిడ్స్ కూడా అవసరమైన మేరకు ఉన్నాయి. నార్మల్ సెలైన్ (ఎన్ఎస్), రింగర్ లాక్టేట్ (ఆర్ఎల్) అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న: అవగాహన కార్యక్రమాలు ఏమైనా నిర్వహిస్తున్నారా?

జవాబు: వడదెబ్బ బారిన పడకుండా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో యూపీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

ప్రశ్న: పిల్లలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: చిన్న పిల్లలు వీలైనంత వరకు ఎండలో తిరగకుండా చూసుకోవాలి. అవసరమైతే కాళ్లకు చెప్పులు, తలకు టోపీ ధరించాలి. నీళ్ల బాటిల్ వెంట తీసుకెళ్లాలి. దాహం వేసిన వెంటనే మంచి నీళ్లు తాగాలి.

ప్రశ్న:కూలీలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: కూలీలు చల్లని సమయాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే పనులు చేయడం మంచిది. తలపాగా, పలుచని తెల్లని దుస్తులు ఉపయోగిస్తే వడదెబ్బ నుంచి రక్షించుకోవచ్చు.

ప్రశ్న: ఏ వయసు వారిపై ఎక్కువ ప్రభావం చూపుతుంది?

జవాబు: ముఖ్యంగా అరవై ఏళ్లు నిండిన వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులకు ఎక్కువగా వడదెబ్బ సోకే వకాశం ఉంటుంది.

ప్రశ్న: ప్రజలకు మీరిచ్చే సూచనలు, సలహాలు ఏమిటి?

జవాబు: ముఖ్యంగా శీతల పానీయాలకు దూరంగా ఉండాలి. వీటిని తీసుకోవడం ద్వారా దాహం తీరదు, ఐస్ క్రీమ్‌లు తినకుండా ఉండటం మంచిది. మసాలా, నూనె వస్తువులు తినకపోవడం శ్రేయస్కరం. ముదురు రంగు దుస్తులు వాడకపోవడం మంచిది.

'హాస్టళ్ల మెస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి'



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్ల మెస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంవత్సర కాలం నుంచి హాస్టల్ మెస్ బిల్లులు చెల్లించలేదని, రెండు సంవత్సరాలుగా హాస్టళ్ల అద్దె భవనాల బిల్లులు చెల్లించకపోవడంతో మూసివేసే దిశగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను బీసీ ప్రతినిధులతో ఆర్.కృష్ణయ్య కలిసి మెస్ బిల్లులు, భవనాల అద్దె బిల్లులపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్చి 31తో ఆర్థిక సంవత్సం ముగిసిందని, కేటాయించిన బడ్జెట్ ల్యాప్స్ అవుతుందని అన్నారు. గత మూడు సంవత్సరాలుగా ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అష్ట, కష్టాలు పడుతున్నారని, చదువులకు దూరమవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒక సంవత్సరం నుంచి బడ్జెట్ విడుదల చేయకపోతే హాస్టళ్లు ఎలా నడుస్తాయని ప్రశ్నించారు. వెంటనే బకాయిలు విడుదల చేయాలని డిప్యూటీ సీఎం ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారని తెలిపారు. దీంతో ఫీజుల ఫీజుల బకాయిలు మూడు నెలల్లో పూర్తి చెల్లిస్తామని అధికారులు హామీ ఇచ్చారని కృష్ణయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలం వెంకటేష్, రాజేందర్, టి.రాజ్‌కుమార్, రామ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల్లో మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్'



నిరసన వ్యక్తం చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నేతలు

కవాడిగూడ: మాదిగ సామాజికవర్గానికి ఎన్నికల్లో ఒక్క సీటు కేటాయించలేదని ముషీరాబాద్ నియోజకవర్గం ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కవాడిగూడ డివిజన్ ఎల్‌ఐసీ కార్యాలయం సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డిలకు వ్యతిరేకంగా ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జెల రాజశేఖర్ మాదిగ మాట్లాడుతూ... తెలంగాణలో మాదిగ సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. మూడు ఎస్సీ రిజర్వుడు పార్లమెంటు స్థానాల్లో దళిత జనాభాలో 27 శాతం ఉన్న మాలలకు రెండు సీట్లు కేటాయించి మరొక స్థానాన్ని ఒక్క శాతం ఉన్న బైండ్ల సామాజికవర్గంకు టికెట్ కేటాయించడం సరికాదన్నారు. ఎంఆర్‌పీఎస్ సీనియర్ నేతలు నాగేష్, జెర్రిపోతుల సత్యనారాయణ, నర్సింహా, ఎం.రవీందర్, దశరథ్, వెంకటయ్య, రోషిన్ వినయ్, సాయిలు, శివప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోను స్వాగతించిన బీసీ నేతలు



మాట్లాడుతున్న గుజ్జ కృష్ణ

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 'మేనిఫెస్టో'ను స్వాగతిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తెలిపారు. సోమవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తే జాతీయ స్థాయిలో కులగణన చేస్తామని రాహుల్ గాంధి ప్రకటించడం అభినందనీయమని అన్నారు. బీసీ సంక్షేమ సంఘం గత అనేక సంవత్సరాలుగా కుల గణన కోసం న్యాయ పోరాటలు, ఉద్యమాలు చేస్తున్నా బీజేపీ ప్రభుత్వం ఏమాత్రం స్పందిచడం లేదని అన్నారు. కేంద్రంలో 30 లక్షల ఉద్యోగాలను అందిస్తామని, నిరుద్యోగ యువతకు ఏడాదికి రూ.లక్ష స్టైఫండ్, మహిళల ఖాతాల్లోకి ఏడాదికి రూ. లక్ష అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు నీల వెంకటేష్, టి.రాజ్‌కుమార్, అనంతయ్య, కృష్ణ పాల్గొన్నారు.

బీజేపీ అంబర్‌పేట జాయింట్ కన్వీనర్‌గా రాజు

కాచిగూడ: బీజేపీ అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్‌గా మైలారం రాజును నియమిస్తూ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు నియామక పత్రాన్ని అందజేశారు. సోమవారం బర్కత్‌పురాలోని పార్టీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ గౌతంరావు మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి గెలుపుకోసం పార్టీ నేతలు, కార్యకర్తలు క్రమశిక్షణ గల సైనికుల వలే పని చేయాలని సూచించారు. పార్టీ నేతలు ఆనంద్‌గౌడ్, ఏడెల్లి అజయ్, కృష్ణ గౌడ్, శ్యామ్‌రాజ్, నాగభూషణం చారి, భిక్షపతి, మనోజ్ యాదవ్ తదితులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రవచనాలు



సామవేదం షణ్ముఖ శర్మను సన్మానించిన కేవీ రణాచారి

నల్లకుంట: శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని అభినందన సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం నల్లకుంట శంకరమఠం ప్రాంగణంలో సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ ప్రవచించిన 'లోకకల్యాణ నాదం-వేదం' ప్రవచనాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంత ఐఏఎస్ అధికారి కె.వి.రమణాచారి ప్రవచన కర్త షణ్ముఖ శర్మను శాలువాతో సన్మానించి మాట్లాడారు. ఉగాది ప్రారంభానికి ముందే ఇలాంటి చక్కటి ప్రవచన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. శంకరమఠం నల్లకుంట బ్రాంచ్ హెడ్ కె.కృష్ణారావు, అలనాటి వెండితెర నటి కె.కృష్ణకుమారి, అభినందన సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ భవాని తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి



అన్నదానం నిర్వహిస్తున్న మాతా వాకర్స్ క్లబ్ సభ్యులు

వీఎస్‌టీ కట్టమైసమ్మ ఆలయం వద్ద అన్నదానం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సమాజ హితం కోసం ప్రతి ఒక్కరు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని మాతా వాకర్స్ క్లబ్ నల్లకుంట అధ్యక్షుడు డాక్టర్ వై.మురళీధరుడు అన్నారు. సోమవారం పాల్గున మాసాన్ని పురస్కరించుకొని వీఎస్‌టీ రోడ్డులోని కట్టమైసమ్మ అమ్మవారి దేవాలయం వద్ద మాతా వాకర్స్ క్లబ్ నల్లకుంట, కట్టమైసమ్మ దేవస్థానం పాలక కమిటి సంయుక్త ఆధ్వర్యంలో సుమారు 500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మురళీధరుడు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఆరోగ్య శిబిరాలు, పేద విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, అన్నదానం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు ఇలాంటి కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమ్మా మెడిటేషన్ సెంటర్ సభ్యులు యోగచార్య శ్రీనివాస్‌రెడ్డి, కొండూరు రామతీర్థ, రాధికారాణి, మాతా వాకర్స్ క్లబ్ పాలక సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘువీర్ విజయలక్ష్మి ట్రస్ట్ నుంచి 11 వేల రూపాయల విరాళాలు అందాయని తెలిపారు.

మత్స్యకారుల సంక్షేమానికి రూ. 5 వేల కోట్లు కేటాయించాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్య పరిశ్రమ అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమానికి ఏటా బడ్జెట్‌లో ఐదు వేల కోట్ల నిధులు కేటాయించి ఖర్చు చేయాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలకృష్ణ మాట్లాడుతూ... పార్లమెంటు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రతి రాజకీయ పార్టీ మత్స్యకార్మికుల సమస్యలను పొందుపరచాలని కోరారు. మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు గొరెంకల నర్సింహ, సి.హెచ్.వెంకన్న, మామిళ్ల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలతో మెరుగైన భద్రత



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పావని, ఎస్‌ఐ ప్రసాద్

చిక్కడపల్లి: భద్రతకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ అన్నారు. సోమవారం డివిజన్‌లోని జనప్రియ అబోడ్స్ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ముషీరాబాద్ పీఎస్ ఎస్‌ఐ ప్రసాద్‌లతో కలసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ... అపార్టుమెంట్‌లలో విధిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. తద్వారా ఏదేని సంఘటన జరిగినప్పుడు నిందితులను గుర్తించడానికి సులభతరం అవుతుందన్నారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, జనప్రియ అబోడ్స్ అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామిదాస్, కార్యదర్శి మల్లేష్, మాజీ కార్యదర్శులు మురళి, సత్యనారాయణ, కమిటీ సభ్యులు మితేశ్, సుధా, సుధాకర్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి



దాతలను సన్మానిస్తున్న రమేష్‌గుప్తా

చిక్కడపల్లి: ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సింగారపు రమేష్‌గుప్తా అన్నారు. సోమవారం చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాత ప్రొద్దుటూరి నర్సింహారావు, సహా దాత వెంకటసుబ్బయ్య సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలను రమేష్‌గుప్తా ఘనంగా సన్మానించారు. కార్యదర్శి చేపూరి లక్ష్మణ్, అడిషనల్ సెక్రటరీ అమర బాలకుమార్, కోశాధికారి చిట్టిమల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల అజెండానే బీఎల్‌ఎఫ్ అజెండా'




మాట్లాడుతున్న నల్లా సూర్యప్రకాష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజల అజెండానే బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్‌ఎఫ్) అజెండా అని ఆ పార్టీ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఎల్‌ఎఫ్ రెండు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బహుజనులకు రాజ్యాధికారం వచ్చేదాక తమవంతుగా పోరాటం చేస్తామన్నారు. కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్న బీజేపీని రానున్న ఎన్నికల్లో ఓడించాలని కోరారు. వరంగల్ పార్లమెంటు స్థానానికి ఎంసీపీఐయూ రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాస్ సావిత్రి, నాగర్‌కర్నూల్ పార్లమెంటు స్థానానికి కంబలి బాలస్వామిలను తమ అభ్యర్థులుగా ప్రకటించారు. ఇప్పటికే ఏడు స్థానాలలో అభ్యర్థులను ప్రకటించామని త్వరలో మరిన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు. బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్, దొంతు రాజేష్, పల్లెపు ఉపేందర్‌రెడ్డి, గోనె కుమారస్వామి, పెద్దారపు రమేష్, ఎస్.ప్రతాప్, బాబురావు, గడ్డం నాగార్జున, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సుందర్‌నగర్‌లో కార్డన్ సెర్చ్

కాచిగూడ: సుందర్‌నగర్‌లో కాచిగూడ డివిజన్ ఏసీపీ రఘు ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇళ్లలో తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని 13 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి, అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎస్‌ఐలు సుభాష్, నరేష్, రవి, మహంకాళి తదితరులు పాల్గొన్నారు.



'ప్రజావాణి'కి స్పందన కరువు

చాదర్‌ఘాట్: ప్రతీ సోమవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి స్పందన కరువైందని మలక్‌పేట సర్కిల్-6 డీసీ జయంత్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని ఆయన స్పష్టం చేశారు. సర్కిల్‌లోని ప్రజలంతా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. యూసీడీ, ట్యాక్స్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

భోలక్‌పూర్‌లో సందడిగా ఇఫ్తార్



ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ పద్మవాలీ కాలనీలో బీఆర్ఎస్ నాయకుడు రఫిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందును బీఆర్ఎస్ మైనార్టీ కమిటీ రాష్ట్ర మాజీ కార్యదర్శి జునేద్ బాగ్దాదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, నాయకులు మున్వర్‌చాంద్, జబ్బార్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.